# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 151 | సోమవారం, 14 ఏప్రిల్ 2024 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# వనజీవి రామయ్యకు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

పద్మశ్రీ వనజీవి రామయ్య అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. ఖమ్మం రూరల్ మండలం లోని రెడ్డిపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మంజిల్లా కలెక్టర్ కె.శ్రీని వాస్ రెడ్డి, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనజీవి రామయ్య అంతిమ యాత్రకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. చివరిసారిగా వనజీవి భౌతికకాయాన్ని సందర్శించి కన్నీటి వీడ్కోలు పలికారు. రామయ్య పాడెను కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మం రూరల్ తహశీల్దార్ ఈ రాంప్రసాద్, మున్సిపా లిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి మోశారు. అనంతరం రెడ్డిపల్లి స్మశాన వాటికలో రామయ్య అంతక్రియలు ని ర్వహించారు.





# నేటి నుంచి భూభారతి

సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

నిర్వహణ ఆ సంస్థకు అప్పగించాలి

సచివాలయంలో సమీక్షా సమావేశం



2

# మోడీ బియ్యం వద్దని లేఖ రాసే దమ్ముందా..?

రేషన్ షాపుల్లో ఇచ్చేవి మోడీ బియ్యమే..

సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సవాల్





2

# కోహ్లీ కుమ్మేశాడు

- ఆర్సీబీ ఖాతాలో నాలుగో విజయం
- 8 వికెట్ల తేడాతో భారీ విక్టరీ
- 33 బంతుల్లో సాల్ట్ 65 పరుగులు
- 45 బంతుల్లో కోహ్లీ 62
- వందో హాఫ్ సెంచరీ చేసిన విరాట్



2

# శ్రీధర్‌బాబు.. మాట మార్చొద్దు

- బ్యాంక్ నుంచి అప్పు తేలేదా..?
- రూ. 170 కోట్ల కమీషన్ ఎందుకిచ్చారు
- దీనిపై సీఎం ఎందుకు స్పందించట్లేదు
- బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే..
- రుణ మధ్యవర్తి ఎవరో చెప్పాలి
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం



2

# నేటి నుంచి ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు

## అంబేద్కర్ జయంతి నాడు జీఓ విడుదల

ఎస్సీ సబ్-కమిటీ డిమాండ్‌ను నెరవేర్చిన కాంగ్రెస్

చట్టం విధివిధానాలను వివరించే జీవోను నేడు జారీ చేస్తాం

రిజర్వేషన్లను పెంపును పరిశీలిస్తున్నాం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

# వక్ఫ్ చట్టం పేరుతో హింసను ప్రేరేపిస్తున్నారు..

లక్నోలో సీఎం యోగి

తీవ్ర విమర్శలు

ముర్షిదాబాద్ హత్యలను ప్రస్తావించిన సీఎం యోగి

వక్ఫ్ భూములు పేదలకు ఉపయోగపడతాయని యోగి ఆదిత్యనాథ్



2

# ఎట్టి పరిస్థితుల్లో క్షమాపణలు చెప్పను

- నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ
- అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలి
- టీజీపీఎస్సీపై నేను కూడా
- పరువు నష్టం దావా వేయబోతున్నా
- బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి



2

# కేసీఆర్‌పై కోపంతో

**అంబేద్కర్‌ను అవమానించొద్దు..**

125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



2

# వక్ఫ్ చట్టం పేరుతో హింసను ప్రేరేపిస్తున్నారు..

- **లక్నోలో సీఎం యోగి తీవ్ర విమర్శలు**
- **ముర్షిదాబాద్ హత్యలను ప్రస్తావించిన సీఎం యోగి**
- **వక్ఫ్ భూములు పేదలకు ఉపయోగపడతాయని యోగి**

**లక్నో ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. వక్ఫ్ చట్టంపై పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసను ప్రస్తావిస్తూ.. ప్రతిపక్షాలు హింసను ప్రేరేపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ముగ్గురు హిందువులను వారి ఇంటి నుంచి బయటకు లాగి దారుణంగా హత్య చేశారన్నారు. లక్నోలో బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ సమ్మాన్ అభియాన్ కింద నిర్వహించిన రాష్ట్ర వర్క్‌షాప్‌లో బీజేపీ నాయకులను ఉద్దేశించి సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు.

"వక్ఫ్ చట్టం పేరుతో హింసను ప్రేరేపిస్తున్నారు. ముర్షిదాబాద్‌లో ముగ్గురు హిందువులను వారి ఇంటి నుంచి బయటకు లాక్కెళ్లి దారుణంగా హత్య చేశారు. ఇంతకీ ఈ ఉదంతానికి ఒడిగట్టిన వ్యక్తులు ఎవరు? వక్ఫ్ భూమి ప్రయోజనం పొందబోయే వాళ్లు ముస్లిం వర్గానికి చెందిన దళితులు, అణగారిన వర్గాల వారే. ఈ భూమి తిరిగి రెవెన్యూ రికార్డుల్లోకి వస్తే.. పేదవాడికి కూడా ఎత్తైన భవనానంలో మంచి ఫ్లాట్ వస్తుంది. పేదలకు మంచి ఫ్లాట్లు వస్తే తమ ఓటు బ్యాంకు పోతుందని విపక్షాలు భయపడుతున్నాయి. అందుకే వీళ్లు హింసను ప్రేరేపిస్తున్నారు." అని సీఎం యోగి వ్యాఖ్యానించారు.

సీఏఏ గురించి ముఖ్యమంత్రి ఆధిత్యానాథ్ ప్రస్తావించారు. "ప్రపంచంలోని ఏ దేశంలో అయిన హిందువులు హింసకు గురైతే వాళ్లు భారత్‌కు వస్తారు. కానీ కాంగ్రెస్‌ఎస్పీ, టీఎంసీ వంటి పార్టీలు దీనికి ఎల్లప్పుడూ అడ్డంకులు సృష్టిస్తాయి. వీళ్లని ఈ పార్టీలు శరణార్థులుగా ఉంచాయి. కానీ బీజేపీ వారిని దత్తత తీసుకుంది. ఈ వక్ఫ్ చట్టం వల్ల వచ్చే భూమి పేదలకు ఆసుపత్రులను అందిస్తుంది. మంచి వైద్య కళాశాలలు నిర్మిస్తారు. మంచి విద్యా కేంద్రాలు సృష్టించబడతాయి. పేద పిల్లలకు చదువుకోవడానికి మంచి సౌకర్యాలు లభిస్తాయి. విపక్షాల ఓటు బ్యాంకు విచ్ఛిన్నమవుతుంది. అందుకే వీళ్లు ఇలాంటి హింసను ప్రేరేపిస్తున్నారు." అని సీఎం యోగి స్పష్టం చేశారు.

# సంక్షేమము లో తెలంగాణ దేశానికే ఆదర్శం

- **మధిరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం భట్టి**
- **అన్ని రాష్ట్రాల చూపు తెలంగాణ వైపు**
- **సన్న బియ్యంతో 3.10 కోట్ల మందికి లబ్ధి**
- **రూ.9,000 కోట్లు తో రాజీవ్ యువ వికాసం**
- **జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ**
- **సన్నధాన్యం బోనస్ కు రూ.2,675 కోట్లు ఖర్చు**

**ఖమ్మం,ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని,పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని,అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఆయన మధిర మండలం,మధిర మున్సిపాలిటీలో వందల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన తదుపరి తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత పాలకులు రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగిస్తే వాటన్నిటినీ సరి చేసుకుంటూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు అన్నారు.గత పాలకులకు ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పది సంవత్సరాలపాటు సన్న బియ్యం సంగీతం పాడారు తప్ప గింజ కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు. పేద వర్గాలకు సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడా జరగడం లేదు అన్నారు.సన్న బియ్యంతో తినాలని ఆశగా ఎదురు చూసే వారికి గత ఉగాది నుంచి రాష్ట్రంలోని 90 లక్షల రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు,2.85 కోట్ల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇవే కాకుండా కొత్తగా రాబోతున్న రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో ఒక కోటి రేషన్ కార్డు దారులకు,3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.నిరుపేదలకు సన్న బియ్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత,అంకిత భావాన్ని ఈ పథకం తెలియజేస్తుందని అన్నారు. కనీ వినీ ఎరుగని గొప్ప కార్యక్రమానికి రాష్ట్ర ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని తెలిపారు.గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి గింజను వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రజలను ఈ సందర్భంగా కోరారు.రాష్ట్ర ప్రజలకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయడమే కాదు సన్నధాన్యం సాగు చేసే రైతులకు మరోవైపు బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.సన్న ధాన్యం సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,675 కోట్ల వెచ్చిస్తున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు రైతు రుణమాఫీ కోసం రూ.21 వేల కోట్లు, రైతు భరోసా కు రూ.18 వేల కోట్లు,సన్నధాన్యం బోనస్ గా రూ.2,675 కోట్లు ,వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటలు ఉచిత విద్యుత్ కోసం రూ.12,500 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వివరించారు. ఇవన్నీ చేపడుతూ తిరిగి పేదలకు సన్న బియ్యం అందించేందుకు రూ.13,525 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. నియామకాల కోసం కోరి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని యువకులు సాధించుకున్నారూ. వారి కలలు నిజం చేసే క్రమంలో ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసాం, మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం రూ.9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట కొత్త స్వయం ఉపాధి పథకాలను చేపట్టినట్టు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటన నాటి నుంచి సాంక్షన్ లెటర్ ఇచ్చేవరకు క్యాలెండర్ ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని వివరించారు. వరుస సెలవులు,వివిధ వర్గాల విజ్ఞప్తి మేరకు రాజీవ్ యువ వికాసం గడువును ఏప్రిల్ 14 వరకు పెంచామని,మండల, జిల్లాస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ఎప్పటి వరకు ముందే ప్రకటించినట్టు తెలిపారు.జూన్ 2 నుంచి 9 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ,మండల కేంద్రాల్లో శాంక్షన్ లెటర్లు ఇచ్చే కార్యక్రమం పూర్తి చేస్తామని తెలిపారు.ప్రకటించిన క్యాలెండర్ ను తూచా తప్పక పాటిస్తామని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాసం కింద ఎంచుకున్న పథకానికి కనీసం మూడు రోజుల నుంచి వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం,తదుపరి గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు డిప్యూటీ సీఎం వివరించారు.నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు.ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, హస్తకళల బోర్డు చైర్మన్ నాయుడు,సత్యం తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు

- **చట్టం విధివిధానాలను వివరించే జీవోను నేడు జారీ చేస్తాం**
- **రిజర్వేషన్లను పెంపును పరిశీలిస్తున్నాం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

అంబేద్కర్ జయంతి సందర్భంగా నేటి నుంచి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ సబ్ కమిటీ తుది సమావేశం నిర్వహించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా అమలు మార్గదర్శకాలను కమిటీ క్షుణ్ణంగా సమీక్షించి, జీవో జారీ చేయడానికి తుది ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చట్టం విధివిధానాలను వివరించే జీవోను నేడు జారీ చేస్తామని తెలిపారు.

కాగా, ఎస్సీ వర్గంలో క్రిమీలేయర్‌ను ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును కూడా కేబినెట్ సబ్ కమిటీ తిరస్కరించింది. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉప సమూహాన్ని మినహాయించకుండా సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలను నీరుగార్చబోమని, అన్ని ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికి వర్గీకరణ రూపొందించబడిందని ఆయన హామీ ఇచ్చారు.

2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15% రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని అన్నారు. తెలంగాణలో ఎస్సీ జనాభా దాదాపు 17.5% పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 2026 జనాభా లెక్కల డేటా అందుబాటులోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లను పెంచే విషయాన్ని పరిశీలిస్తుందని ఆయన అన్నారు.

అయితే, షెడ్యూల్డ్ కులాలకు ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్లను హేతుబద్ధీకరించడం ఈ ఎస్సీ వర్గీకరణ చట్టం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో 59 ఎస్సీ ఉప కులాలను పరస్పర వెనుకబాటుతనం ఆధారంగా మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 1 కేటగిరిలో అత్యంత వెనుకబడిన 15 వర్గాలు ఉన్నాయి. మొత్తం ఎస్సీ జనాభాలో ఈ వర్గాలకు చెందిన వారు 3.288 శాతం ఉన్నారు. వారికి ఒక శాతం రిజర్వేషన్లను కేటాయించారు. మధ్యస్తంగా ప్రయోజనాలను పొందే 18 వర్గాలను గ్రూప్ 2 కేటగిరిలో చేర్చారు. మొత్తం ఎస్సీ జనాభాలో వీరు 62.74 శాతం ఉండగా.. 9 శాతం రిజర్వేషన్లను కేటాయించారు. సాపేక్షంగా మెరుగైన 26 వర్గాలకు గ్రూప్ 3 కేటగిరిలో చేర్చారు. వీరు ఎస్సీ జనాభాలో 33.963 శాతం ఉండగా.. 5 శాతం రిజర్వేషన్లు పొందనున్నారు.



# కోహ్లీ కుమ్మేశాడు

- **ఆర్సీబీ ఖాతాలో నాలుగో విజయం**
- **8 వికెట్ల తేడాతో భారీ విక్టరీ**
- **33 బంతుల్లో సాల్ట్ 65 పరుగులు**
- **45 బంతుల్లో కోహ్లీ 62**
- **వందో హాఫ్ సెంచరీ చేసిన విరాట్**

**స్పోర్ట్స్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌పై బెంగళూరు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు సాల్ట్ 65 (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), కోహ్లీ 62* (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదరగొట్టడంతో 174 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు 17.3 ఓవర్లలోనే ఛేదించింది. లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన బెంగళూరు మొదటి ఓవర్ నుంచే రాజస్థాన్‌పై ఎదురు దాడికి దిగింది. ఒకవైపు సాల్ట్, మరోవైపు కోహ్లీ ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ పరుగుల వరద పారించారు. వీళ్లిద్దరి దూకుడు చూస్తే, మొత్తం టార్గెట్‌ను వీళ్లే పూర్తి చేసేలా కనిపించారు. ఈ క్రమంలో కార్తికేయ వేసిన బంతిని ఎదుర్కొన్న ఫిలిఫ్ సాల్ట్.. యశస్వికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ 40* (28 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్) కలిసి కోహ్లీ మ్యాచ్ ముగించాడు. రాజస్థాన్ బౌలర్లలో కార్తికేయకు ఒక వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఫిలిప్ సాల్ట్ ఎంపికయ్యాడు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జైస్వాల్ 75 (47 బంతుల్లో, 10 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధశతకంతో రాణించాడు. చివర్లో ధ్రువ్ జురెల్ (35*) అదరగొట్టాడు. కెప్టెన్ సంజు (15) నిరాశపర్చాడు. రియాన్ పరాగ్ 30 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. హిట్‌మెయర్ 9, నితీశ్ రాణా 4* పరుగులు చేశారు. బెంగళూరు బౌలర్లలో యశ్, హెజిల్‌వుడ్, కృనాల్, భువీ ఒక్కో వికెట్ తీశారు.

**టీ20ల్లో కోహ్లీ వందో హాఫ్ సెంచరీ..**

ఫిలిప్ సాల్ట్ ఉన్నంతసేపు నిదానంగా బ్యాటింగ్ చేసిన విరాట్ కోహ్లీ.. ఆ తర్వాత జూలు విదిల్చాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో టీ20ల్లో తన వందో హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. ఈ క్రమంలోనే ప్రపంచ టీ20 క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో డేవిడ్ వార్నర్ 108 హాఫ్ సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు.



# డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మందకృష్ణ మాదిగ

- **ఏ దేశంలో లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉన్నది**
- **భారత రాజ్యాంగం,సుప్రీంకోర్టు తీర్పు వల్లనే ఈ వర్గీకరణ సాధ్యమైనది.**
- **వర్గీకరణకు యావత్తు సమాజం సహకారం అందించింది**
- **మాకు సహకరించిన సమాజానికి ఎప్పుడూ కృతజ్ఞతగా ఉంటాం**

**ఖమ్మం,ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**ప్రపంచ వ్యాప్తంగా భూమి లేని వారైనా ఉన్నారు కానీ ఏ దేశంలో లేని కుల వ్యవస్థ మనదేశంలోని ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు,పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ అన్నారు. మండల పరిధిలోని వల్లభి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.మొదట హైదరాబాదు నుండి కోదాడ మీదుగా వల్లభి గ్రామానికి చేరుకొని ప్రధాన సెంటర్ నుండి సీతారాముల దేవస్థానంలో పూజలు నిర్వహించి కాలినడకన ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహాన్ని ఆవిష్కరించి సభలో పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా భారతదేశంలో ముగ్గురు మహనీయులు జన్మించారని ఆ ముగ్గురు మహాత్మ జ్యోతిరావు పూలే,జగ్జీవన్ రావ్,డాక్టర్ అంబేద్కర్ మహనీయుల కుటుంబాలకు మనమెంతో రుణపడి ఉన్నామని తెలిపారు.ఆ ముగ్గురు పుట్టకపోతే ఈ వర్గాలకు ఈమాత్రం కూడా అవకాశాలు దొరికేవి కావన్నారు.కొన్ని కులాల వారే సంపద కలిగి ఉండాలని, స్వేచ్ఛగా తిరగాలని,సేవ చేయాలని ఈ దేశ సంస్కృతిలోనే ఉందని,కానీ వేల సంవత్సరాల క్రితం పుట్టిన మనల్ని ఈనాటికి అంటరాని వారిగానే చూడటం ఈ దేశంలో మాత్రమే ఉందని ఆవేదన చెందారు.ఈ కుల వ్యవస్థలో దళిత కుటుంబాలలో పుట్టిన బలహీన వర్గాలలో పుట్టిన ఎందరో మహానుభావులు ఈ దేశంలో కుల వివక్షనకు గురవుతూనే ఉన్నారన్నారు. 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని కానీ నేడు రాజ్యాంగం వల్ల సుప్రీంకోర్టు తీర్పు వల్ల వర్గీకరణ సాధించుకున్నామన్నారు. నేడు వర్గీకరణ న్యాయమైందని యావత్ సమాజమే తోడుగా నిలిచిందని వారందరికీ ఎప్పుడు కృతజ్ఞతలు తెలుపుతూ ఉంటామని తెలిపారు.వర్గీకరణ ఈ రెండు మూడు రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టపరంగా అమలవుతుందని రానున్న రోజుల్లో తల్లిదండ్రులు పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని ఆ బాధ్యత సీరియస్ గా తీసుకోవాలన్నారు.ఎంత కష్టం వచ్చినా చదివే విషయంలో ఏమాత్రం తగ్గొద్దని రేపటి పిల్లల భవిష్యత్తుకు పునాది వెయ్యాలని అన్నారు. రానున్న రోజుల్లో మన పిల్లలకి మంచి భవిష్యత్తు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పి ,ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు గుండెపాక నరసయ్య మాదిగ,మంద దేవేంద్ర ప్రసాద్ మాదిగ, ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, వినసపల్లి అశోక్ మాదిగ, కూరపాటి సునీల్ మాదిగ, తూరుగంటి అంజయ్య మాదిగ,వంగూరి ఆనందరావు మాదిగ,బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ,నూకల నాగేశ్వరరావు మాదిగ,బొడ్డు అనిల్,పగిడి కత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి భూభారతి

- **సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**
- **నిర్వహణ ఆ సంస్థకు అప్పగించాలి**
- **సచివాలయంలో సమీక్షా సమావేశం**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

భూభారతి అమలుపై అధికారులతో సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్‌ను నేడు జాతికి అంకితం చేయబోతున్నట్లు తెలిపారు. సామాన్య రైతుకు కూడా అర్థమయ్యేలా భూభారతిని రూపొందించాలని అధికారులకు సూచించారు. భూభారతి తాత్కాలికం కాదని.. కనీసం వంద సంవత్సరాల పాటు ఉంటుందని అన్నారు. భూభారతి వెబ్‌సైట్ సైతం అత్యాధునికంగా ఉండాలని తెలిపారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. భూభారతి నిర్వహణ విశ్వసనీయత సంస్థకు అప్పగించాలని ఆదేశించారు.

# మోడీ బియ్యం వద్దని లేఖ రాసే దమ్ముందా..?

- **రేషన్ షాపుల్లో ఇచ్చేవి మోడీ బియ్యమే..**
- **సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సవాల్**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

మోడీ బియ్యం వద్దని లేఖ రాసే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. కరీంనగర్ లోని జూబ్లీనగర్ లో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గావ్ చలో'కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కిలోకు రూ.37 ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గొప్పనా లేక రూ.10 ఇస్తున్న రేవంత్ రెడ్డి గొప్పనా అని ప్రశ్నించారు. ప్రతి పేదవారికి రూ. 37లు ఖర్చు పెట్టి మోదీ ప్రభుత్వం రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తుంటే, కనీసం ప్రధాని ఫొటో కూడా పెట్టకపోవడం దారుణమన్నారు. ఇన్నాళ్లు సన్న బియ్యం ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు.

# కేసీఆర్‌పై కోపంతో అంబేద్కర్‌ను అవమానించొద్దు..

- **125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించాలి**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

మాజీ సీఎం కేసీఆర్ కోపంతో విశ్వమేధావి అయిన డా. అంబేద్కర్‌ను అవమానించడం మంచిది కాదంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. 'నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించాలి. నేడు బీఆర్ అంబేద్కర్ జయంతి నేపథ్యంలో స్వయంగా ముఖ్యమంత్రే ముందుకు వచ్చి కేబినెట్ మంత్రులతో సహా అంబేద్కర్ స్మృతి వనాన్ని సందర్శించి, ఆ మహనీయునికి నివాళులర్పించాలి. 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించి.. ఆయన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారు. ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను గౌరవిస్తున్నాయి. కానీ, మన పరిపాలన కేంద్రమైన సెక్రటేరియట్ పక్కనే నిర్మించిన 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించకపోవడం సముచితం కాదు' అంటూ ఆమె పేర్కొన్నారు.

# శ్రీధర్‌బాబు.. మాట మార్చొద్దు

- **బ్యాంక్ నుంచి అప్పు తేలేదా..?**
- **రూ. 170 కోట్ల కమీషన్ ఎందుకిచ్చారు**
- **దీనిపై సీఎం ఎందుకు స్పందించట్లేదు**
- **బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే..**
- **రుణ మధ్యవర్తి ఎవరో చెప్పాలి**
- **ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**



మంత్రి శ్రీధర్ బాబుపై బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీఐఐసీకి ప్రభుత్వం 400 ఎకరాలు ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. టీజీఐఐసీ బాండ్ల రూపంలో ఐసీఐసీఐ వద్ద అప్పు చేయలేదా? అని నిలదీశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ద్వైపాక్షిక ఒప్పందం చేసుకొని రుణం తీసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రుణం తీసుకునేందుకు రూ. 170 కోట్లు కమీషన్ ఇవ్వలేదా? ఆ కమీషన్ ఎలా ఇచ్చారో శ్రీధర్‌బాబే చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే రుణ మధ్యవర్తి ఎవరో చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

# ఎట్టి పరిస్థితుల్లో క్షమాపణలు చెప్పను

- **నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలి**
- **టీజీపీఎస్సీపై నేను కూడా పరువు నష్టం దావా వేయబోతున్నా**
- **బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి**

**హైదరాబాద్ ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**



ఎట్టి పరిస్థితుల్లో టీజీపీఎస్సీకి తాను క్షమాపణ చెప్పబోనంటూ బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి తేల్చి చెప్పారు. పూర్తి ఆధారాలతో గ్రూప్1 అవకతవకలు బయటపెట్టామన్నారు. ఆ అవకతవకలపై ఎదురవుతున్న ప్రశ్నలకు టీజీపీఎస్సీ సమాధానాలు చెప్పట్లేదన్నారు. నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలన్నారు. టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా ఎందుకు లేడంటూ ఆయన ప్రశ్నించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకిచ్చారని కూడా రాకేశ్ రెడ్డి టీజీపీఎస్సీని ప్రశ్నించారు. మహిళ, పురుషులకు వేర్వేరు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారు? మొత్తం 46 సెంటర్లుంటే 2, 3 సెంటర్ల నుంచే టాపర్స్ ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. రిటైర్డ్, కాంట్రాక్టు లెక్చరర్లతో గ్రూప్1 పేపర్లు దిద్దిస్తారా? అంటూ రాకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అవకతవకలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు. అంతేకాదు నోటీసులకు భయపడి క్షమాపణలు చెప్పనన్నారు. దీనిపై న్యాయ విచారణ జరిపిస్తే.. అన్ని ఆధారాలు చూపిస్తామన్నారు. అదేవిధంగా తాను కూడా టీజీపీఎస్సీపై పరువు నష్టం దావా వేయబోతున్నాను అంటూ రాకేశ్ రెడ్డి కూడా చెప్పారు.

# ఢిల్లీ దూకుడుకు బ్రేక్





## ఉత్కంఠ పోరులో ముంబై విజయం
## 12 పరుగుల తేడాతో గట్టెక్కిన హార్దిక్ సేన
## 3 వికెట్లు పడగొట్టిన కర్ణ్ శర్మ

**స్పోర్ట్స్ బ్యూరో ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఐపీఎల్ 18లో ముంబయి ఇండియన్స్ రెండో విజయం సాధించింది. ఢిల్లీతో జరిగిన ఉత్కంఠ పోరులో హార్దిక్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ(59) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌట్ అయింది. బుమ్రా వేసిన 19వ ఓవర్‌లో చివరి మూడు బంతులకు ముగ్గురు ఢిల్లీ బ్యాటర్లు రనౌట్స్‌గా వెనుదిరిగారు. దీంతో ఆ జట్టు అనూహ్యంగా చివరి మెట్టుపై బోల్తా పడింది. ఆ జట్టులో కరుణ్ నాయర్ (89: 40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) విశ్వరూపం ప్రదర్శించాడు. ముంబయి బౌలర్లలో కర్ణ్ శర్మ 3, శాంట్నర్ 2, దీపక్ చాహర్, బుమ్రా ఒక్కో వికెట్ తీశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ (59: 33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో చెలరేగాడు. ఓపెనర్ రోహిత్ శర్మ(18) మరోసారి నిరాశపరిచాడు. ఐదో ఓవర్లో విప్రజ్ వేసిన చివరి బంతికి ఎల్బీగా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రికెల్టన్(41: 25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రోహిత్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్య కుమార్ యాదవ్(40: 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా బ్యాట్ ఝుళిపించాడు. చివర్లో నమన్ (38*: 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. ఢిల్లీ బౌలర్లలో విప్రజ్, కుల్దీప్ రెండేసి వికెట్లు.. ముకేశ్ ఒక వికెట్ తీశారు.

# పాపం ప్రీతి

- పంజాబ్ కు రివర్స్ ట్రోలింగ్
- ప్రీతీ జింటా టార్గెట్ గా రెచ్చిపోయిన మీమర్లు
- సోషల్ మీడియాలో నవ్వుల్ నవ్వుల్

**స్పోర్ట్స్ బ్యూరో ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

ఐపీఎల్ టీమ్స్‌లో చాలా యాక్టివ్‌గా ఉండే సోషల్ మీడియా ఏదంటే ఠక్కున గుర్తుకొచ్చేది రాజస్థాన్ రాయల్స్. ఆర్ఆర్ సోషల్ మీడియా కౌంటర్లు, ట్రోల్స్ మామూలుగా ఉండవు. ఐపీఎల్‌లో ఆర్ఆర్ మ్యాచ్ ఉందంటే ఫస్ట్ అందరూ ఆ జట్టు సోషల్ మీడియా అకౌంట్లు ఓపెన్ చేస్తారు. అప్పుడప్పుడు ఓన్ ప్లేయర్స్‌ని కూడా రాజస్థాన్ సోషల్ మీడియా రోస్ట్ చేస్తుంది. ఈ సీజన్‌లో ఆ రోల్‌ని పంజాబ్ కింగ్స్ తీసుకున్నట్లు కనిపిస్తోంది.

ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అన్నప్పటి నుంచి పంజాబ్ కింగ్స్ సోషల్ మీడియా చాలా యాక్టివ్ అయింది. హైదరాబాద్‌లో అడుగుపెట్టినప్పుడు దుబాయ్ శీను డైలాగ్ ఫ్యాన్స్‌కి హాయ్ చెప్పిన పంజాబ్ కింగ్స్ వెళ్లేటప్పుడు మాత్రం బాలయ్య బాబు డైలాగ్‌తో బాయ్ చెప్పింది. సరిపోతుందా శనివారం అని ఛాలెంజ్ చేసి సర్‌సర్లే ఎన్నెన్నో అనుకుంటాం అని ముగించింది.

ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు నుంచి పంజాబ్ కింగ్స్ సోషల్ మీడియా కయ్యానికి కాలు దువ్వుతూనే ఉంది. తెలుగు సినిమా డైలాగ్స్‌తో ఆరెంజ్ ఆర్మీని రెచ్చగొట్టింది. ప్రభాస్ వీడియోతో శరణమా.. రణమా అంటూ సవాల్ విసిరింది. పంజాబ్ కింగ్ బ్యాటింగ్ చూసి ఈ రోజు 300 ఉండొచ్చు అని.. తగ్గేదేలే అంటూ మీసం మెలేసింది.

అయితే సన్‌రైజర్స్ సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టినప్పటి నుంచి పంజాబ్ కింగ్స్ సోషల్ మీడియా పోస్ట్‌లు నవ్వు తెప్పించాయి. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఊచకోతకు బ్రహ్మానందం ఫొటో పోస్ట్ చేసి మీకు దండం పెడతా ఆపండిరా నాయనా అన్నట్టు పోజిచ్చారు. వికెట్ పడకుండానే మ్యాచ్ ముగిస్తారేమో అని ఖలేజా మహేష్ బాబు ఫొటోతో ఇంక నావల్ల కాదురా నాయనా అని చేతులెత్తేసింది. తీరా మ్యాచ్ ముగిశాక వీరభద్ర సినిమాలో బాలకృష్ణ జిఫ్‌తో సర్‌సర్లే ఎన్నెన్నో అనుకుంటాం అన్నీ జరుగుతాయా ఏంటీ అని ముగించింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ప్రియాన్ష 36, ప్రభుసిమ్రాన్ 42, శ్రేయాస్ అయ్యర్ 82, ఆఖర్లో స్టాయినిస్ 34 పరుగులు చేశారు. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 18.3 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ 66, అభిషేక్ శర్మ 141 పరుగులు చేసి మ్యాచ్‌ని ఒంటిచేత్తో గెలిపించారు.




# బౌలింగ్ మీద గురి పెట్టండి బ్రో..

- బౌలింగ్ లో ఫెయిల్ అవుతున్న ఎస్ఆర్‌హెచ్
- అభిమానులకు ప్రతి మ్యాచ్ లో నిరాశే..
- షమీపైనే భారమంతా..

**స్పోర్ట్స్ బ్యూరో ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

స్వయంగా కెప్టెనే స్టార్ పేసర్. అతడికి తోడుగా ఓ సీనియర్ ఫాస్ట్ బౌలర్. వీరితోపాటు ఒకప్పటి 'పర్పుల్' క్యాప్ హీరోనూ పేసర్‌గా తెచ్చుకుంది. ఇంతమంది స్టార్లున్నా సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ మాత్రం తీసికట్టుగానే తయారవుతోంది. ఒకప్పుడు ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ అంటే అందరికీ హడల్. ఇప్పుడు మాత్రం వీరి బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాటర్లు వీరబాదుడు బాదుతుండటం ఫ్యాన్స్‌ను నిరాశకు గురి చేస్తోంది. తాజాగా పంజాబ్ కింగ్స్ హైదరాబాద్‌పై 240 ప్లస్ పరుగులు చేయడం గమనార్హం. బ్యాటర్లు రాణించి భారీ టార్గెట్‌ను ఛేదించారు కాబట్టి సరిపోయింది. లేకపోతే మరో ఓటమిని మూటగట్టుకునేదే.



**ఆ పరిణితి ఎక్కడ?**


ఔటీ20ల్లో బ్యాటర్లదే హవా అని తెలిసిందే. కానీ, తెలివిగా బంతులేస్తే వారిని కట్టడి చేయొచ్చని బౌలర్లు నిరూపించారు. పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతూ ఉంటారు. అక్కడా వికెట్లు తీసి సత్తా చాటిన 'స్టార్' పేసర్లూ ఉన్నారు. ఆ జాబితాలో భువనేశ్వర్ కుమార్ ఒకడు. అతడిని వదిలేసిన ఎస్ఆర్‌హెచ్ షమీని తీసుకుంది. షమీ కూడా సీనియరే. భారత్ తరఫున ఎన్నో మ్యాచుల్లో గెలిపించాడు. ఐపీఎల్‌లోనూ పలు సీజన్లలో తన సత్తా ఏంటో చూపించాడు. గుజరాత్ తరఫున గత ఎడిషన్లలో అదరగొట్టాడు. అలాంటి బౌలర్ నుంచి హైదరాబాద్ అభిమానులు చాలా ఆశించారు. తీరా ఇక్కడికి వచ్చాక నాణ్యమైన ప్రదర్శన చేయలేక ఇబ్బందిపడుతున్నాడు. గత ఐదు మ్యాచుల్లో కనీసం 11 ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. తాజాగా పంజాబ్‌తో మ్యాచ్‌లో ఏకంగా 75 పరుగులు సమర్పించుకున్నాడు. ఆరు మ్యాచుల్లో కేవలం ఐదు వికెట్లే పడగొట్టాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటే.. వైవిధ్యంగా బంతులేస్తేనే ఫలితం సానుకూలంగా వస్తుందనేది కాదనలేని సత్యం. ఈ విషయంలో షమీ కాస్త సమయస్ఫూర్తి ప్రదర్శించాలి. స్లో బంతులు, ఆఫ్ కట్టర్లు, బౌన్సర్లను సరైన సమయంలో సంధిస్తేనే ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయగలమని క్రికెట్ విశ్లేషకుల సూచన.

**నిలకడ లేకుండా..**

కెప్టెన్ పాట్ కమిన్స్ సూపర్ బౌలర్. ఆసీస్ జట్టును బౌలింగ్ ప్రతిభతో గెలిపించాడు. గత ఐపీఎల్ సీజన్‌లోనూ హైదరాబాద్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. మరి అలాంటి కమిన్స్ నుంచి ఈసారి పేలవ బౌలింగ్ రావడం అభిమానులను షాక్‌కు గురి చేస్తోంది. అయితే, దీనికి కారణం కూడా లేకపోలేదు. షమీ తేలిపోవడంతో ఆ భారం కమిన్స్‌పై పడుతోందనేది కొందరి వాదన. గతంలో పవర్ ప్లే స్పెషలిస్ట్ భువనేశ్వర్ ముందుండి నడిపించేవాడు. తొలి ఆరు ఓవర్లలో ప్రత్యర్థికి చెందిన బ్యాటర్లను ఒత్తిడికి గురి చేసి వికెట్ తీసేవాడు. ఆ తర్వాత నట్టూ (నటరాజన్) కూడా కట్టుదిట్టంగా బంతులేసేవాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా కమిన్స్ విజృంభించేవాడు. ఈసారి కొన్ని మ్యాచుల్లో ఫర్వాలేదనిపించినా సరిపోలేదు. ఆరు మ్యాచుల్లో 4 వికెట్లే పడగొట్టాడు. ఆడమ్ జంపాను రెండు మ్యాచుల్లో ఆడించినా పెద్దగా ప్రయోజనం దక్కలేదు. 8 ఓవర్లలో 94 పరుగులు సమర్పించాడు. హైదరాబాద్ తరఫున హర్షల్ పటేల్ టాప్ వికెట్ టేకర్. ఇప్పటి వరకు 8 వికెట్లు తీశాడు. కానీ, భారీగా పరుగులు ఇస్తుండటం కలవరానికి గురి చేసే అంశం. మొత్తం 17 ఓవర్లలో 164 పరుగులు అంటే దాదాపు 9కిపైగా సగటుతో బౌలింగ్ చేస్తున్నాడు. యువ స్పిన్నర్ జీషాన్ అన్సారీ తనకొచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాడు. సిమర్‌జిత్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేక ఇబ్బంది పడ్డాడు.

**బ్యాటింగ్‌పైనే భారం వద్దు..**

ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లపైనే ఎక్కువ ఒత్తిడి ఉంది. ఓడిపోయిన వాటిల్లో బ్యాటింగ్ విభాగం సరిగా ఆడలేదని విమర్శలు చేసినా.. కీలకంగా వ్యవహరించాల్సిన బౌలింగ్ ఏ దశలోనూ మెప్పించలేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా లేనప్పుడు బౌలర్లే బాధ్యతాయుతంగా ప్రత్యర్థిని కట్టడి చేయాలి. అలా జరగడంలో విఫలమైనందునే సన్‌రైజర్స్‌కు వరుసగా నాలుగు పరాజయాలు ఎదురైనట్లు గణాంకాలు చూస్తే తెలిసిపోతుంది. ఎస్ఆర్‌హెచ్ ఇంకా 8 మ్యాచులు ఆడాల్సి ఉంది. ప్రస్తుతం ఖాతాలో నాలుగు పాయింట్లు ఉన్నాయి. ప్లేఆఫ్స్ చేరుకోవాలంటే కనీసం ఆరు మ్యాచుల్లో గెలవాలి. అలా జరగాలంటే కేవలం బ్యాటింగ్‌తోనే కాకుండా.. మెరుగైన బౌలింగ్ ఉంటేనే తేలికగా మారుతుంది.





## ఉత్కళ ఒడియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒరియా ఫెస్టివల్ పత్...

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ప్రజా స్వరం):** ఉత్కళ ఒడియా యూత్ అసోసియేషన్ హైదరాబాద్ ఆద్వర్యంలో ప్రఖ్యాతి గాంచిన ఖాజాగూడ సరస్సు ఆదివారం హైదరాబాద్ ప్రవాసీ ఒరియా ఫెస్టివల్ పత్ ఉత్సవంలో భాగంగా పరిసర ప్రాంతాలలో నివసించే ఒరిస్సా ప్రజలందరూ ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఇస్కాన్ బృందం వారిచే మొదటగా కృష్ణ పరమాత్మ, రామలీలలు పై గాణమృతం చేశారు, ఆ తరువాత రోడ్ రంగోలి మురుజా, ఆతోంటిక్ ఒడియా క్యూసిన్, డిస్ప్లేఆర్ట్, పైకా ఆర్ట్, రానపా ఆర్ట్, టైగర్ నృత్యాలు ఆదిగా ప్రేక్షకులను అలరించారు , శంఖ నాథాలతో కూడిన నృత్యం ప్రత్యేక ఆకర్షణ నిలచి, ఓద్రా దేహం జుంబా నృత్యాలతో పాటు పిల్లల గ్లోబల్ ఆర్ట్స్ డ్రాయింగ్ కాంపిటీషన్లను ఆకర్షణగా నిలిచాయి, ఈ కార్యక్రమంలో సౌమ్య మిశ్రా ఐ.పి.ఎస్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ పాండ్వా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ములేపిన హైదరాబాద్ కుర్రాడు

- ముంబై జట్టును ఆదుకున్న మనోడు
- తిలక్ వర్మ మెరుపు హాఫ్ సెంచరీ

**స్పోర్ట్స్ బ్యూరో ఏప్రిల్ 13(ప్రజా స్వరం):**

ఐపీఎల్ 2025లో పేలవ ప్రదర్శన చేస్తూ.. పాయింట్ల పట్టికలో చివరి స్థానం కోసం సీఎస్కేతో పోటీ పడుతున్న ముంబై ఇండియన్స్.. జూలు విదిల్చింది. టేబుల్ టాపర్‌గా ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఆ జట్టు బ్యాటర్లు సత్తా చాటారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ పాండ్యా సారథ్యంలో ముంబై ఇండియన్స్.. 205/5 స్కోరు చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో హైదరబాదీ ప్లేయర్ తిలక్ వర్మ మెరుపు హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు.



ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లోకల్ టీమ్ కెప్టెన్ అక్షర్ పటేల్.. ముంబై ఇండియన్స్‌కు బౌలింగ్ అప్పగించాడు. అయితే ఆ జట్టు ఓపెనర్లు రోహిత్ శర్మ (12 బంతుల్లో 18 రన్స్), ర్యాన్ రికల్టన్ (25 బంతుల్లో 41 రన్స్) రాణించడంతో 4.5 ఓవర్లలో 47/0తో నిలిచింది. రోహిత్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ (28 బంతుల్లో 40 రన్స్) కూడా బ్యాట్ ఝుళిపించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ.. చెలరేగిపోయాడు.

3 సిక్స్‌లు, ఆరు ఫోర్ల సాయంతో తిలక్ వర్మ.. 33 బంతుల్లోనే 59 రన్స్ స్కోరు చేశాడు. చివర్లో నమన్ ధీర్.. మంచి ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. 17 బంతుల్లో 38 రన్స్ చేసి.. జట్టు స్కోరును 200 పరుగుల మార్కు దాటించాడు. దీంతో చివరకు ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు స్కోరు చేసింది.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో విప్రజ్ నిగమ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, ముకేశ్ కుమార్ 1 వికెట్ తీశారు. కాగా ఈ టోర్నీలో ఇప్పటివరకూ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని జట్టు ఏదైన ఉందంటే.. అది ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రమే. ఎందుకంటే ఆ జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ గెలుపొందింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అటు ముంబై ఇండియన్స్.. ఐదింట్లో నాలుగు మ్యాచ్‌లు ఓడి.. 9వ స్థానంలో నిలిచింది.





## ఆరోగ్య కేంద్ర్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా స్వరం) :**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఆదివారం హవేలీ ఘన పూర్ మండలం సర్దన గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంబంధిత వైద్యాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్న తీరును కలెక్టర్ ఆరా తీశారు.ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలని, రోగుల సంఖ్య పెరగాలని అన్నారు. పేషెంట్లతో మాట్లాడి ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు...? అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మందులు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, లేబర్ రూమ్ లో సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పేషెంట్లకు మెరుగైన, నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

## హాజరైన మాజీ ఎంపీ బీబీ పాటిల్



**మెదక్, ఏప్రిల్ 13 (ప్రజా స్వరం) :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెదక్ పట్టణం గోల్కొండ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయన విగ్రహాలను శుభ్రం చేసి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. అణగారిన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. బీజేపీ పార్టీ బడుగు బలహీనవర్గాలకు వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. 14 ఏప్రిల్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుని ఆయన ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్, బీజేపీ మండల అధ్యక్షురాలు బెండ వీణ, నాయకులు శివ, కల్కి నాగరాజు, రంజిత్ రెడీ, ప్రభాకర్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదుర్గమ్మ జాతర



**తూప్రాన్, ఏప్రిల్ 13 (ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ లో ఆదివారం కనకదుర్గమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సీనియర్ బీజేపీ కార్యకర్త ఎల్లా గౌడ్ గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ పట్టణ ప్రెసిడెంట్ జానకిరామ్ గౌడ్,కిష్టాపూర్ తాజా మాజీ సర్పంచ్ పోచయ్య,తూప్రాన్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు మహేష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, సిద్ధిరాములు యాదవ్ కృష్ణాపూర్ గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ప్రజాస్వరం) :**

కోట్లాది మంది బహుజనల చీకటి బతుకులలో వెలుగులు నింపిన డాక్టర్ బి.అర్.అంబేద్కర్ అడుగుజాడల్లో పయాణించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. అదివారం నాడు దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ చౌరస్తా లో డాక్టర్ అంబేద్కర్ కూర్చున్న విగ్రహాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శంకర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లు మాట్లాడుతూ ఎర్రటి ఎండను లెక్కచేయకుండా నీలీ జెండాలతో ర్యాలి నిర్వహించడం అభినందనియమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ రాయకొతే దళితులు నేటికి దొరల గడిలలో వెట్టి బతుకులు బతికెవారన్నారు. కుల,మత,ఆడ,మగ,పెద,ధనిక తేడా లేకుండా మనుషులందరిని సమానత్వం తో చూడలన్నారు. ముబారస్ పూర్ లో నేటికి గుడిసెలలో దళితులు జివిస్తున్నందున వారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ను కొరారు.రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి దశ,దిశను చూపరన్నారు.అంబేద్కర్ లేకపొతే దళితుల బతుకులు అధ్వాన్నంగా వుండేవి అన్నారు.ఎస్సీ ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందన్నారు.దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దళితుల తలరాతలు మారడం లేదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధును అమలుచేయలన్నారు.హైదరాబాదు 125 అంబేద్కర్ విగ్రహం, మ్యూజియం ను ప్రజలకు అందుబాటులో తెవలని డిమాండ్ చేశారు. దుబ్బాక నుండి వెళ్ళి గెట్లను బద్దలు కొట్టాల్సివస్తదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో దళిత నాయకులు స్వామి,యాదగిరి పలువురు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**నార్సింగి, ఏప్రిల్ 13 (ప్రజా స్వరం) :**

కొన్ని మతతత్వ పార్టీలు భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు భాధ్యత అని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో మండల కోఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్, యెన్నం రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజా గౌడ్, రాజేందర్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువా, పూల మాలల తో సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మతతత్వ పార్టీల కుట్రలో రాజ్యాంగం నలిగిపోవద్దని రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కలిగించిందని ఆయన పేర్కొన్నారు. కొన్ని మతతత్వ పార్టీలు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నాయని, ఆ కుట్రలను తిప్పి కొట్టడానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ కై జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర దుబ్బాక నియోజకవర్గం లో అన్ని మండలాల్లో విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు. ప్రతి మండలానికి కోఆర్డినేటర్ ను ఏర్పాటు చేసి రాజ్యాంగ పరిరక్షణ కోసం గ్రామ గ్రామా న బాపూజీ, అంబేద్కర్, రాజ్యాంగం, చిత్రపటాలను పట్టుకొని ర్యాలీ నిర్వహించి సందేశాన్ని ప్రజలకు చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆదానీ అంబానీ లకు సంపదను దోచి పెడుతుందని చెరుకు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ప్రజా పాలన అందిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాల వద్ద మండల కోఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్ ప్రజలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వినోద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు బాలరాజు గౌడ్, కేశవులు, రాజేష్, సంపత్ రెడ్డి, బాచి స్వామి, శ్రీధర్ రెడ్డి, రఫీఖ్, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా గౌడ్, నరసింహులు, బాలాజీ, శంకర్ నాయక్, జహీర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వారోత్సవాల్లో పాల్గొన్న కృష్ణ గౌడ్



**మేడ్చల్, ఏప్రిల్ 13 (ప్రజా స్వరం) :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారోత్సవాల సందర్భంగా రేపు జరుగేటువంటి అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా నాయకులు సముద్రాల కృష్ణ గౌడ్ నాయకులు జేతువాలా కిషన్, చెంచాల సురేష్ ముదిరాజ్, చింతలపూడి రామారావు, మలిగే శ్రీకాంత్, చింతలపూడి విజయ్ సద్గుణ రావులతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి


**దౌల్తాబాద్, ఏప్రిల్ 13( ప్రజాస్వరం) :**

రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన దౌల్తాబాద్ లో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... దౌల్తాబాద్ పట్టణానికి చెందిన గుండెకాయ శ్రీనివాసు(శ్రీను)46 అని రైతు ప్రతిరోజు తన వ్యవసాయ పొలం వద్దకు వెళుతూ వ్యవసాయాన్ని చేసుకుంటూ భార్య పిల్లలను పోషించేవాడు అదే మాదిరిగా ఏప్రిల్ 09.04.2025న సాయంత్రం తన వ్యవసాయ భూమి నుండి దౌల్తాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలోదౌల్తాబాద్ గ్రామ శివార్లలోని ఆది వెంకన్న వ్యవసాయ పొలం వద్ద ద్విచక్ర వాహనం వెళుతున్న సమయంలో, బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు, ఫలితంగా అతని తలకు తీవ్ర గాయమైంది". ఈనెల 12న గాంధీ ఆసుపత్రిలో ఉదయం 10:30 గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మృతి చెందారని మృతుడి సోదరుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు, ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా రాములవారి రథోత్సవం

**తూప్రాన్, 13ఏప్రిల్ (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం రథోత్సవ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద ఈనెల 4వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ రోజు చివరి రోజు కావడంతో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు తూప్రాన్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని దర్శనం చేసుకున్నారు అనంతరం సీతారాముల విగ్రహాలకు చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి,తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ, నారాయణ గుప్తా, కమ్మరి శ్రీధర్, మామిండ్ల అనిల్, మన్నే శ్రీనివాస్, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.







## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నార్సింగి, ఏప్రిల్ 13 (ప్రజా స్వరం) :**

నార్సింగి మండల కేంద్రం లోని మహర్షి దయానంద గురుకుల పాఠశాల 20002001 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వనం రిసార్ట్స్ నిర్వహించగా కార్యక్రమానికి మహర్షి దయానంద గురుకుల వ్యవస్థాపకుడు పండిత్ జీ శ్రీ కేశవ నారాయణ, కరస్పాండెంట్ జయశ్రీ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఆత్మీయంగా పలకరించి వారిని శాలువ లు మెమెంటో లతో సన్మానించారు. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ దాదాపు 24 సం తర్వాత ఇలా అందరినీ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, అందరూ జీవితంలో మంచి స్థాయిలో ఉన్నందుకు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాజారామ్, నరేందర్ చుంచు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్తులన్నీ ఏవిరో...





తెలంగాణ బ్యూరో ఏప్రిల్ 13(ప్రజా స్వరం): **వేసవి వచ్చిందంటే చాలు పల్లెటూర్లు పిల్లలతో కలకలలాడేవి. పల్లెల్లో ఎక్కడ చూసినా వారు ఆడుతూ కనిపించేవారు. ఉదయం నుంచి మొదలు రాత్రి అయ్యేవరకు కూడా పిల్లలతోనే సందడిగావే ఉండేవి. దీంతో వేసవి కాలమంతా పల్లెలు కోలాహలంగా అనిపించేది. కానీ, ఇప్పుడా వాతావరణం అంతగా కనిపించడంలేదు. ఎండాకాలంలో పిల్లలు గోటీల ఆటలు, చిర్రగోనె, కబడ్డీ, క్రికెట్, ఉయ్యాలాట, దుంకుడు బిల్లా, రింగ్ బాల్, ఇసుక తిన్నెల మీద ఎగిరి దుంకడాలతోపాటు ఇతర ఆటలు ఆడుతుండేవారు. ఏ చెట్టు కిందనో, లేక నీడనో చూసుకుని ఆడేవారు. ఐస్ క్రీమ్, పండ్లు, ఇతర ఆహార వస్తువులు అమ్మేవారు వస్తే పల్లెలకు రాగానే వారిని పిల్లలు చుట్టుముట్టి తమకు అవసరమైన కొనుక్కుని తింటూ ఆనందపడేవారు. వారు పల్లెంతా తిరిగి, ఆ తరువాత పల్లెను వదిలి వెళ్లేవరకు పిల్లలంతా పరుగెత్తుకుంటూ వారి వెంట వెళ్తూ ఆనందపడేవారు. అదేవిధంగా పల్లెల్లో ఏ బావిని చూసినా అక్కడ పిల్లలు ఈతలు కొడుతూ కనువిందుగా కనిపించేవి. అప్పడప్పుడు పాటలు కూడా పాడుతుండేవారు. ఇలా ఆటపాటల్లో పూర్తిగా మునిగిపోయేవారు.**


ఇటు తల్లిదండ్రులతో పంట పొలాలకు వెళ్లేవారు. వీరిని కొత్త ప్రదేశాలకు తీసుకెళ్లడం, దేవాలయాలకు, చుట్టాలంటికి, విహార యాత్రలకు తీసుకెళ్లడం వంటివీ చేసేవారు. ఇళ్లలో ఉన్నప్పుడు ఇష్టాచమ్మా, కచ్చకాయలాట వంటి పలు ఆటలు ఆడేవారు. వీరితోపాటు ఇంట్లో పెద్దలు కూడా ఆడుతూ తెగ ఆనందపడేవారు. ఇలా వేసవిలో ఏ ఇల్లు చూసినా సంతోషాలతో కనిపిస్తూ ఉండేది. ఇటు చుట్టాలు కూడా పట్టణాల నుంచి తమ పిల్లలతో పల్లెటూర్లకు వచ్చేవారు. ఇలా పల్లెటూర్లు వేసవిలో పిల్లలతో కనువిందుగా కనిపించేవి. ప్రతి వేసవి పిల్లలకు ఒక మధురమైన బాల్యపు జ్ఞాపకంగా ఉండేది. వారు పెరుగుతున్న కొద్దీ ఆ జ్ఞాపకలను గుర్తుచేసుకుంటూ సంతోషించేవారు.



కానీ, పల్లెటూర్లలో ఇప్పుడు ఆ పరిస్థితులు అంతగా కనిపించడంలేదు. సాధారణ రోజుల్లో ఏ విధంగానైతే ఉంటాయో అదే విధంగా ఉంటున్నాయి. సందడి వాతావరణం అసలే లేదు. ఇందుకు కారణాలు ఏమంటే.. పిల్లలు ఆటల కంటే అధికంగా ఎలక్ట్రానిక్ వస్తువులకు అడిక్ట్ అయ్యారని చెబుతున్నారు. ఇటు తల్లిదండ్రులు కూడా ఎండ లేదా ఇతర కారణాల వల్లనో వారిని ఇంటి బయటకు పంపేందుకు ఇష్టపడడంలేదంటున్నారు. వారికి కావాల్సినవన్నీ ఇంట్లోనే ఉండేలా చూస్తున్నారని చెబుతున్నారు. ఈ వేసవి సమయంలో కాంపిటీషన్ ఎగ్జామ్స్ కో, లేదా ఇతర తదుపరి తరగతులకు సిద్ధం చేయడమో జరుగుతుందని అంటున్నారు. దీంతో పిల్లలకు అటుగా ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడు సిటీల్లోనే..

అయితే, గతంలో పల్లెటూర్లలో ఉండే ఈ సందడి ఇప్పుడు పట్టణాల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. ఏ స్విమ్మింగ్ పూల్ చూసినా పిల్లలతో ఆనందంగా కనిపిస్తుంది. మార్నింగ్ సమయంలో సైక్లింగ్ లేదా జాగింగ్, యోగా చేస్తున్న పిల్లలతో పార్కులు ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. క్రికెట్, షటిల్ తోపాటు ఇతర గేమ్స్ కు కూడా వెళ్తున్నారు. అదేవిధంగా కరాటే వంటివాటికి వెళ్లి నేర్చుకుంటున్నారు. పల్లెటూర్లలో ఎక్కువగా వినిపించే కర్రసాము వంటి ప్రత్యేక సాధనలను సైతం పిల్లలు వేసవిలో నేర్చుకుంటున్నారు. సాయంత్రం సమయంలో తమ పిల్లలను ఎగ్జిబీషన్లకు తీసుకెళ్తున్నారు. అప్పుడప్పుడు తీర్థ, విహార యాత్రలకు తీసుకెళ్లడం వంటివి చేస్తున్నారు. ఇలా సిటీలో పిల్లలు వేసవిని తెగ ఎంజాయ్ చేస్తున్నారు.















MOVIE TIME

06 | ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక

14.04.2025
సోమవారం | హైదరాబాద్

# సారంగపాణి జాతకం బాగులేనట్టుందిగా..!

## కొత్తగా మరో విడుదల తేదీ ప్రకటన

సారంగపాణి జాతకం మూవీ.. ప్రముఖ దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి.. బలగం, కోర్టు సినిమాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి కాంబోలో ఒక సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. ఏప్రిల్ 18న విడుదల కాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విడుదల తేదీని కూడా వాయిదా వేసింది టీమ్. దీంతో కొత్తగా మరో విడుదల తేదీని ప్రకటించింది. ఈ మూవీని ఏప్రిల్ 25 తేదీన విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. అనంతరం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాను శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తుండగా.. రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తుంది. వి.కె. నరేష్. తనికెళ్ళ భరణి, వెన్నెల కిశోర్, అవసరాల శ్రీనివాస్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, హర్షిణి, రూపలక్ష్మి, కె.యల్. కె. మణితోపాటు పలువురు ఈ సినిమాలో నటిస్తున్నారు.




# రామ రామ సాంగ్ రిలీజ్

## కర్మాన్‌ఘాట్‌కు విశ్వంభర దర్శకుడు


ప్రధాన పాత్రలో మెగాస్టార్ చిరంజీవి, హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తున్న విశ్వంభర చిత్రం డైరెక్టర్ వశిష్ట హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌లో ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నాడు. శనివారం ఉదయం కర్మాన్‌ఘాట్ ఆలయంకు వెళ్లిన వశిష్టతో పాటు చిత్రబృందానికి ఆలయ అధికారులు స్వాగతం పలికి సినిమా పెద్ద హిట్టు అవ్వాలని కోరుకున్నారు. నేడు హనుమాన్ జయంతి సందర్భంగా ఫస్ట్ సింగిల్ రామ రామ అనే పాటను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్రబృందం తాజాగా పంచుకుంది. ఇవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# ఇక మాస్ జాతర

రవితేజ హీరోగా, శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోన్న చిత్రం మాస్ జాతర. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మొదటి పాట ప్రోమోను విడుదల చేశారు. తు మేరా లవర్ అంటూ సాగుతున్న ఈ పాటలో రవితేజ తన స్టెప్పులతో అదరగొట్టేశారు. ఈ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చాలా మంది సీనియర్ నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# సదాను ఓదారుస్తున్న నెటిజన్స్

## ఎమోషనలవుతూ పోస్ట్ పెట్టిన నటి

ప్రముఖ నటి సదా తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. ఇప్పుడా పోస్ట్ నెట్టింటా వైరల్ అవుతుంది. అయితే ఈ అమ్మడు ఓ పెట్‌ని తన సొంత ప్రాణంగా చూసుకుంటుంది. ఇప్పుడు ఆ పెట్ డాగ్ లైలా మరణించడంతో చాలా ఎమోషనల్‌గా తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది సదా. తన పెట్‌పై పూలు ఉంచి ఆర్ఐపీ లైలా అంటూ పోస్ట్ పెట్టింది. ఈ పోస్ట్ ను చూసిన నెటిజన్స్ సదాకి ధైర్యం చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. కొద్ది రోజుల క్రితం రష్మీ పెట్ డాగ్ కూడా ఇలానే చనిపోతే ఆమె కూడా చాలా ఎమోషనల్‌గా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. ఇక సదా విషయానికి వస్తే.. చాలా కాలం పాటు సదా స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. డ్యాన్స్ షో కి జడ్జ్ గా వ్యవహరిస్తూ అందరినీ ఎంటర్ టైన్ చేసిన విషయం తెలిసిందే.



# ఆ హీరోతో నటించాలనేది నా కోరిక

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటించిన 'అర్జున్ రెడ్డి' మూవీ ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పక్కర్లేదు. ఈ చిత్రం ద్వారా షాలినీ పాండే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంతోనే షాలిని మంచి గుర్తింపు పొందింది. తన అందం, అమాయకత్వం, సహజమైన నటనతో తెలుగు ప్రేక్షకులో, ముఖ్యంగా యూత్‌లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. దీంతో ఆమె స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత ఆమె చేసిన సినిమాలు పెద్దగా హిట్ కాకపోవడంతో రేస్ లో ఆమె వెనుకబడిపోయింది. దీంతో ప్రజంట్ హిందీ, తమిళ భాషలో సినిమా, సిరీస్‌లో నటిస్తూ అక్కడ తన టాలెంట్‌ను నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. తాజాగా తనకు ఏ హీరోతో నటించాలని ఉందో షాలినీ పాండే ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి నటించాలనేది తన కోరిక అని షాలినీ పాండే చెప్పింది. అతని కళ్లలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుందని, నటనలో ఒక మాయ ఉంటుందని తెలిపింది. రణబీర్ తో కలిసి ఒక్క రోజైనా పని చేయాలనేది తన కోరిక అని చెప్పింది. ప్రతి సినిమాలో రణబీర్ నటనలో మార్పు కనిపిస్తుందని కితాబునిచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999